



జై శ్రీమన్నారాయణ

శ్రీమన్నారాయణ రామానుజ యతిభ్యోనమః

ఓం అస్మత్ గురుభ్యోనమః

**పరమాచార్యుల కృపతో అమెరికాలో**

**జీయరు ఆశ్రమ ప్రారంభోత్సవాలు**

**శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్**

**స్వామి వారి దివ్య మంగళాశాసనములతో...**

'జీయర్ శతాబ్ది' మహోత్సములో భాగంగా మన దేశములోనే కాక అమెరికా మొదలగు ఇతర దేశాలలో కూడా ఉండే భక్తులను తరింపచేయుటకై పరమ కృపతో 'ప్రపన్న దీక్షను' శ్రీచిన్న జీయర్ స్వామి వారు అనుగ్రహించిన విషయము అందరకు విదితమే.

మన స్వామి వారు అమెరికా లోని భక్తులను ఉద్దేశించి న్యూజెర్సీలో దీక్షా విధిని సవిశేషముగా వివరించి అనుగ్రహించారు. 'నరం శ్రియాజుష్టమివోపజీవినః' అన్నట్లుగా, సంపన్నుడైన వ్యక్తిని సేవించు జనుల వలె , ఆచార్యుల అనుగ్రహానికి పాత్రులమైన మనకు ఒకదాని వెంట ఒకటిగా అనేక శుభ పరంపరలు తారసిల్లాయి .



ఆధ్యాత్మిక శిక్షణకు అమెరికాలో ఒక పెద్ద కేంద్రము (జీయరు ఆశ్రమము) ఏర్పాటుకై సంకల్పము జరిగింది. అనతికాలంలోనే న్యూజెర్సీ ప్రాంతంలో 31 ఎకరముల స్థలమున ఆశ్రమము వెలసింది. ప్రయత్నించినా కొంత సమయం పడుతుందేమో అనుకున్న కార్యములన్నీ అతి వేగముగా పూర్తి అయ్యి , సరిగ్గా మన పరమాచార్యులు అయిన శ్రీశ్రీశ్రీ పెద్ద జీయరు స్వామి వారి తిరునక్షత్రము రోజునే (తాళం చేతులతో సహా)

మనదిగా స్వాధీనం అవడం అత్యంత ఆశ్చర్యమూ, ఆనందమూ కలిగించింది.  ఇది కేవలం మన ఆచార్యుల, పరమాచార్యుల పరమ కృపకు నిదర్శనంగా భావించిన భక్తుల ఆనందోత్సాహాలు అతిశయించాయి.





ఆచార్యుల ఆజ్ఞతో శ్రావణ బహుళ పంచమి గురువారం (ఆగష్టు 21, 2008) రోజున ఆశ్రమ ప్రారంభోత్సవాలు - వాస్తుపూజ, వాస్తుహోమం, వేదశాంతి, 11 మార్లు అఖండ శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణములతో మొదలై, శ్రావణ శుక్రవారం ఉదయం శ్రీమద్భగవద్గీత పారాయణం, సాయంకాలం సామూహిక లక్ష్మి కుంకుమార్చన జరిగింది. శనివారం ఉదయం రమణీయమైన ఆశ్రమ ప్రాంగణంలో మామిడి తోరణాల మంగళవాద్య ధ్వనులు భక్త జన సందోహముల మధ్య శ్రీ సుదర్శన హోమం అత్యంత వైభవముగా నిర్వహింపబడినది. సోమవారం సాయంకాలం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు జరిగాయి. మొదటి రోజు సప్తాహ దీక్షగా ప్రారంభమైన సుందరకాండ పారాయణము బుధవారం శ్రీరామ పట్టాభిషేక మహోత్సవంతో ఘనంగా ముగిసినది.  ఈ వారం రోజులు అనేకమంది







భక్తులు కార్యక్రమంలో పాల్గొని , ఆచార్యుల విషయమున తమ కున్న శ్రద్ధాసక్తులను ప్రకటించారు. ఏరోజు కారోజే కార్యక్రమం ప్రత్యేకతను సంతరించుకుంది.



జన్మాష్టమి వేడుకలు భక్తబృందం మధ్య చిన్నారుల నాట్య గాన సుధలు, శ్రీకృష్ణ పూజ, అవతార రహస్య వివరణలతో అత్యంత వైభవంగా జరిగింది. ఉట్టి కొట్టే ఉత్సవం ప్రత్యేకతను సంతరించుకుంది. 30 రకములకు పైగా ప్రసాదలతో భక్తులు భరద్వాజ విందులు అందుకున్నారు. అమెరికా లోని శ్రీవారి శిష్యులు – శ్రీమాన్ గుదిమెళ్ళ సురేంద్రాచార్యులు, శ్రీమాన్ మరింగంటి యుగంధరాచార్యులు పై కార్యక్రమాలను ఘనంగా నిర్వహించి శ్రీస్వామి వారి ఆశీస్సుల ను పొందారు.

కార్యక్రమ నిర్వాహకులు, ఆశ్రమం వెలయడానికి ప్రధాన కారకులు మన జెట్ యు. యస్. ఏ. కోశాధికారి అయిన శ్రీమాన్ శర్మ అళక్కి శ్రీమతి విజయ దంపతులకు, తమ విలువైన కాలము, శ్రమ, ధనాదులను వెచ్చించి ఆచార్య నిష్ఠను చూపిన కార్యకర్తలకు, భక్త బృందానికి అందరికీ శ్రీస్వామి వారు తమ దివ్య మంగళాశాసనాలను అనుగ్రహించారు. జీయరు శతాబ్దిని పురస్కరించుకొని, ఇక్కడి ఆశ్రమములో శ్రీరామ క్రతు స్తూపం వెలయాలనే భక్తుల ఆకాంక్షకు శ్రీ స్వామి వారు తమ మంగళాశాసనములు కృప చేశారు.

మనదేశంలోనే కాకుండా విదేశాల్లోకూడా, ఆధ్యాత్మిక వికాసానికై నిర్విరామ కృషి జరుపుతున్న అపర రామానుజులైన మన స్వామివారి శ్రీ చరణాలకు జీవకోటి పక్షమున ఇవే మా దాసోహములు.

“ రామానుజాచార్య దివ్యాజ్ఞా ప్రతివాసర ముజ్వలా |
దిగంత వ్యాపినీ భూయాత్ సా హి లోక హితైషిణీ ||“

జై శ్రీమన్నారాయణ





